




# ఫార్మా కంపెనీని రద్దు చేయాలని



**కోస్గి-నవభూమి :** ఫార్మా కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన పాదయాత్ర చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. కోస్గి పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ ప్రజలు రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అలాంటి కొడంగల్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయకుండా ప్రజలు వ్యతిరేకిస్తున్న ప్రాజెక్టులను నెలకొల్పేందుకు పూనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు ఆశించినంత అభివృద్ధి జరగడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం, మ హేశ్వరం నియోజకవర్గాల్లో ల్యాండ్ అక్విజేషన్ పూర్తి చేసి 14 వేల ఎకరాలను సిద్ధంగా ఉంచిందని, అక్కడి భూమిని వదిలి కొడంగల్‌లో నియోజవర్గంలోని దుద్యాల్ మండలంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి పూనుకున్నారన్నారు. ఫార్మాసిటీని రైతు లు వ్యతిరేకిస్తున్నా ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో చెప్పాలన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని 30 శాతం మాత్రమే పూర్తి చేశారన్నారు.ముఖ్యమంత్రి చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన ఉదయం 7 గంటలకు పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకొని అక్కడినుంచి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి హకీంపేట్, ఆర్‌బీతండా మీదుగా దు ద్యాలలోని తాసీల్దార్ కార్యాలయం వర కు పాదయాత్ర చేపడుతామన్నారు. కొ డంగల్‌లోని రైతులు, యువకులు, ఫార్మా బాధితులు, నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ము గింపునకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరుకానున్నారన్నారు. కార్యక్రమం లో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మ న్ శాసం రామకృష్ణ, నాయకులు ఎండీ సలీం, కోట్ల జైపాల్, వెంకట్‌నర్సింహ లు, జనార్దన్‌రెడ్డి, శ్రీను, మోహన్‌గౌడ్, వెంకటేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే మార్పు



**కల్వకుర్తి-నవభూమి :** ఇందిరమ్మ రాజ్యంలోనే రాష్ట్రంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా అప్పుల్లో ఉన్నా, పేదల కోసం ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేశామన్నారు. సోమవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అమృత్-2 మంచినీటి పథకం, రూ.10 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రూ.కోటీ ఏడు లక్షలతో చేపట్టనున్న 24 కుల, యువజన సంఘాలకు ప్రహరీలు, కస్తూర్బా విద్యాలయం ఇంటర్ అదనపు గదుల నిర్మాణాలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 4,000 ఇందిరమ్మ ఇళ్లను ఈ నెలాఖరులోపు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ధరణి స్థానంలో బలమైన 2024 ఆర్‌వోఆర్ చట్టాన్ని తేనున్నట్లు చెప్పారు. ప్రతీ కుటుంబానికి డిజిటల్ గుర్తింపు కార్డును ఇస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేలా అది ఉంటుందని చెప్పారు. రైతు రుణమాఫీకి అవసరమైన రూ.31 కోట్లతోపాటు అదనంగా మరో రూ.500 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు 61 వేల ఉద్యోగాలు ఇచ్చామని, భవిష్యత్తులో పలు రకాల నోటిఫికేషన్లు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి విశాలమైన వాతావరణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరిక మేరకు కల్వకుర్తికి ఆర్డీవో కార్యాలయాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కశిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధికి పాటుపడే వ్యక్తి అని, ఆయన్ను ఎన్నుకోవడం ప్రజల అదృష్టమన్నారు.అభివృద్ధిలో ముందుంచుతాం: కశిరెడ్డి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని, కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతామని చెప్పారు. పట్టణంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, ఆర్డీవో ఎస్.రాజేషకుమార్, తహసీల్దార్ ఇబ్రహీం, కమిషనర్ మహమ్మద్ షేక్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, షానవాజ్‌ఖాన్, బొమ్ము ఆంజనేయులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రగతి, సంక్షేమం రెండు కళ్లు



**కల్వకుర్తి-నవభూమి :** అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కండ్లని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని వివిధ అభివృద్ధి పనులకు, వెల్దండ మండలకేంద్రంలో రూ.కోటితో నిర్మించనున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వెల్దండ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మట్ట వెంకటయ్యగౌడ్ పొలంలో ఈత మొక్కలను నాటి నీళ్లు పోశారు.ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ హామీలను ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తున్నామన్నారు. వెల్దండలో త్వరలోనే నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ భవన సముదాయంలో పాఠశాలను ఏర్పాటు చేసుకుందామన్నారు. అంతకుముందు మంత్రికి కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్‌గైక్వాడ్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేశారు.ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీ, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, జయప్రకాశ్, మోతీలాల్, రవీందర్‌రావు, రషీద్, శ్రీనుయాదవ్, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తాసీల్దార్ కార్తీక్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు నిలకడగా వరద



**ధరూరు-నవభూమి :** జూరాల ప్రాజెక్ట్‌కు వరద నిలకడగా కొనసాగుతున్నది. ఆదివారం ప్రాజెక్ట్‌కు ఎగువ నుం చి 61 వేల క్యూసెక్కుల వరద రాగా.. మూడు గేట్లను ఎత్తి 21,630 క్యూసెక్కులను దిగువకు వదిలారు. విద్యుదుత్పత్తికి 37,252, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్ట్-2కు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కులను విడుదల చేశారు.ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.439 టీఎంసీల నిల్వ ఉన్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 14,733, అవుట్‌ఫ్లో 14,422 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 101.773 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 41,318, అవుట్‌ఫ్లో 40,675 క్యూసెక్కులుగా ఉన్నది. ఆయకట్టుకు 643 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం ఆనకట్టలో 10.7 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. అలాగే ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 21,010, అవుట్‌ఫ్లో 21,010 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 19,021, అవుట్‌ఫ్లో 15,600 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 37.61 టీఎంసీల నిల్వ ఉన్నది.

## పని భారాన్ని తగ్గించాలని..




**వనపర్తి-నవభూమి** : తమపై పని భారాన్ని తగ్గించాలని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుం చి కలెక్టరేట్ వరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఆశవర్కర్ల సంఘం రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడారు.ల్యాబ్ టెక్నిషియ న్ శిక్షణ పొందిన వారు మాత్రమే బీపీ, షుగర్ టెస్టులు చేయగలుగుతారని, కానీ ఆ పరీక్షలన్నీ ఆశవర్కర్లతో చే యించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని, వనపర్తి జిల్లాలోనే ప్రత్యేకంగా ఎందుకు చేయిస్తున్నారని ప్ర శ్నించారు. పెండింగ్‌లో ఉన్న సెప్టెంబర్ నెల జీతాన్ని వెం టనే చెల్లించాలని, టీపీ, 2023-24 పల్స్ పోలియో సర్వే లెప్రసీ సర్వే డబ్బులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలన్నారు.వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిక్సన్, ఆశవర్కర్ల యూ నియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చమ్మ, సునీత, కోశాధికారి భాగ్య, ఇంద్ర, నాయకులు ఇందిర, సత్యమ్మ, గోవిందమ్మ, సుజాత, మంజుల, లక్ష్మీదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో ముందుకుసాగాలి



**గోపాల్‌పేట-నవభూమి** : ప్రజలంతా ఐకమత్యంతో ముందుకుసాగాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి వచ్చిన నిరంజన్‌రెడ్డికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో లక్ష్మీదేవిపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మీడియా కన్వీనర్ అశోక్, నాయకులు మతీన్, చంద్రశేఖర్, బంగారయ్య, శ్రీశైలం, యాదగిరి, లక్ష్మీనారాయణ, శంకర్, మణ్యం నాయక్, మల్లేశ్, లక్ష్మారెడ్డి, మనేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో ఇంటికి తాళం వేస్తే జరభద్రం

**మహబూబ్‌నగర్-నవభూమి** : దసరా సెలవులు వచ్చాయి.. ఊర్లు, విహారయాత్రలు, బంధువుల ఇండ్లకు కుటుంబంతో సహ ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు ఒక్కసారి ఆలోచించండి.. దొంగలు ఇదే అదునుగా భావించి ఇంటి తాళం పగులకొట్టి చోరీకి పాల్పడే అవకాశం ఉంటుంది.ఇండ్ల భద్రత మరచిపోవద్దని పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోతున్నారు. అందుకని తప్పనిసరిగా కుటుంబంతో సహ వెళ్లాల్సి వస్తే.. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు చెప్పండి.. వారు మీ ఇంటికి భద్రత కల్పించే వీలుంటుంది. ఇంట్లో విలువైన వస్తువులు, నగలు, నగదు వెంట తీసుకెళ్లడమే మంచిదని పోలీసులు చెబుతున్నారు.విలువైన వస్తువులు ఇంట్లో ఉంచొద్దు.దసరా సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు ఇంట్లో విలువైన వ స్తువులను పెట్టొద్దు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే పోలీసులకు స మాచారం ఇవ్వాలి. లేదంటే నగలు, నగదును లాకర్‌లో భద్రపర్చుకోవాలి. డబ్బు, నగలు దొంగతనం అయ్యాక బాధపడేకంటే.. ముందే జాగ్రత్తలు తీసుకుం టే నష్టాన్ని నివారించుకోవచ్చు. పెద్ద మొత్తం నగదుతో కార్లలో వెళ్లేవారు డ్రైవర్ల గురించి ముందే తెలుసుకోవాలి.

# పది రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

**గోపాల్‌పేట-నవభూమి** : పది రోజులుగా పలు గ్రామాలకు నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలను వెంటనే పునఃప్రారంభించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఏదుల మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏదుల మండల సాధన సమితి ఆధ్వర్యంలో దాదాపు 300 మంది రైతులు, నాయకులు, స్థానికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదుల, అనంతపురం, చెన్నారం, చీర్కపల్లి, గొల్లపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, సింగాయపల్లి, రేకులపల్లి, గుండ్యావాల్యానాయక్ తండాలను కలిపి ఏదుల మండలంగా ఏర్పాటు చేశారన్నారు.అయితే, నూతన తాసీల్దార్ కార్యాలయంలో పది రోజులుగా ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, సింగాయపల్లి, రేకులపల్లి, గుండ్యావాల్యానాయక్ తండా వాసులకు భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే సేవలను కొనసాగించాలన్నారు. అనంతరం తాసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. తాసీల్దార్.. కలెక్టర్ ఆదర్శ్‌సురభి దృష్టికి తీసుకెళ్లారు.దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి ఆర్డీవో పద్మావతి దీక్షా శిబిరం వద్దకు చేరుకోగా.. ఆమెకు కూడా వినతిపత్రం అందజేశారు. టెక్నికల్



సమస్యతో బదలాయింపు నిలిచిందని, మంగళవారం నుంచి కొనసాగిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. అలాగే మండలకేంద్రంలో ఎంపీడీవో, ఏవో, ఎంఈవో, మహిళా సమాఖ్య కార్యాలయాలను కూడా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఏదుల మండల యూనిట్‌గానే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పెట్టుబడి సాయం ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు

**నారాయణపేట-నవభూమి** : పంట పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. 2018 మే 10వ తేదీన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని శాలపల్లి-ఇందిరానగర్ వద్ద నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. 2018-19లో ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు విడతల్లో ఏటా రూ.8 వేలను అందించింది. 2019-20 నుంచి పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచి.. ఏటా రూ.10 వేలను రైతుల ఖాతాల్లో జమచేస్తూ వచ్చింది.వానకాలం పెట్టుబడిని ఏప్రిల్ నుంచి.., యాసంగి సాయాన్ని నవంబర్ నుంచి పంపిణీ చేసేవారు. పథకం ప్రారంభం నుంచి 2023 యాసంగి వరకు 12 విడతల్లో నారాయణపేట జిల్లాకు రూ.2,404.86 కోట్ల సాయాన్ని అందించారు. ఇందులో 11 సార్లు బీఆర్ఎస్ సర్కారు అందించగా.. 12వ సారి పెట్టుబడి వేసేందుకు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ దృష్ట్యా నిలిచిపోయింది. ఆ తర్వాత 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటికే సిద్ధంగా ఉన్న రైతుబంధు డబ్బులను ఖాతాల్లో జమ చేసింది.ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. పెట్టుబడి సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.7,500కు పెంచి ఇస్తామని చెప్పినా.. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే గత విడుతలో ఎకరాకు రూ.5వేల చొప్పున అందించింది. అయితే, పథకం పేరు మార్చినా రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. కేసీఆర్ పాలనలో ఠంచన్‌గా డబ్బులు అందగా.. నేడు ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించినట్లున్నది. ఈ ఏడాది వానకాలం సాగు సమయం ముగిసినప్పటికీ ఇంతవరకు డబ్బులు జమకాకపోవడం శోచనీయం.



**నారాయణపేట జిల్లాలో రైతుబంధు**

వివరాలు..రైతుబంధు పథకం ప్రారంభమైన తొలి విడుతలో (2018) వానకాలం సీజన్‌కు నారాయణపేట జిల్లాలో 1,26,592 మంది రైతులకు గానూ రూ.159.94 కోట్లు.., 2018 యాసంగిలో 1,20, 553 మందికి రూ.157.27 కోట్లు పంపిణీ చేశారు. 2019 వానకాలంలో 1,27,920 మందికి రూ. 180.73 కోట్లు, యాసంగి సీజన్‌లో 1,02,895 మందికి రూ.127.28 కోట్లు.., 2020 వానకాలంలో 1,44,671 మందికి రూ.219.22 కోట్లు.., యాసంగి సీజన్‌లో 1,47,829 మందికి రూ. 221.12 కోట్లు.., 2021 వానకాలంలో 1,54, 678 మందికి రూ.222.69 కోట్లు, యాసంగిలో 1,59,846 మంది ఖాతాల్లో రూ.222.96 కోట్లు జమచేశారు. 2022 వానకాలంలో 1, 65,873 మందికి రూ.224.18 కోట్లు, యాసంగి లో 1,63,257 మందికి రూ.219.81 కోట్లు.., 2023 వానకాలం లో 1,74,687 మందికి రూ. 225.24 కోట్లు, యాసంగిలో 1,76,747 మంది రైతులకుగానూ రూ.224.42 కోట్లు పంపిణీ చేశారు.

**రూ.15 పైసలు కూడా ఇవ్వలేదు..**

కేసీఆర్ ప్రభుత్వంలో పంట సాగు ప్రారంభానికి ముందే రైతుబంధు డబ్బులిచ్చేవారు. మాకు ఎలాంటి ఇబ్బందుల్లేకుం డా కేసీఆర్ సర్కారు ఆదుకున్న ది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం సీజన్ ముగియడానికి వచ్చినా ఇంతవరకు రైతుభరోసా డబ్బులు జమచేయలేదు. రైతులపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు మిత్తీలు కూడా కట్టే పరిస్థితుల్లో లేము. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి.. ఎకరాకు 15 పైసలు కూడా ఇవ్వలేదు. రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మా రింది. రుణమాఫీ పూర్తిగా చేయలేక చేతులెత్తేసిన రేవంత్‌రెడ్డికి రానున్న రోజుల్లో తగిన గుణపా ఠం చెబుతాం. నగేశ్‌గౌడ్, రైతు, పసుపుల,

**మిత్తీ కట్టలేకపోతున్నాం..**

ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడంతో ఆ పైసలతో సంబురంగా సాగు చేద్దామని అనుకున్నా. కానీ, డబ్బులు ఇవ్వకపోవడం తో బయటి వ్యక్తులతో అప్పు తె చ్చాను. ప్రకృతి కన్నెర చేయడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో మిత్తీలు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పేరిట సకాలంలో డబ్బులు జమయ్యేవి. నేడు పంట ముగిసే సమయానికి పైసలు రాలేదు. దసరా నాటికి రైతుభరోసా ఇస్తామని చెప్పినా.. ఆ ప్రభు త్వం మీద నమ్మకం లేకుండా పోయింది. ప్రస్తుత నేను నాలుగెకరాల్లో వరి సాగు చేశాను. గత నెలలో కురిసిన వర్షాలతో పంట దెబ్బతిన్నది. ఇ ప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసాతోపాటు పంట లు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఆ దుకొంటే బాగుంటుంది.

**చాలా ఇబ్బందులు పడుతున్నాం..**

రైతు సంక్షేమం కోసం కేసీఆర్ సర్కారు రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు పం టలకు కలిపి రూ.10 వేలను సాగు సమయంలో ఖాతాల్లో జమచేసేది. దీంతో దళారుల వద్ద అప్పు తెచ్చే బాధ తప్పేది. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం సాగు ముగియడానికి వచ్చినా ఇప్పటి వరకు రూపాయి కూడా జమకాలేదు. దీంతో చాలా ఇబ్బందులు ప డుతున్నాం. అప్పులు తెచ్చి సాగు చేపట్టామని న ష్టం రావడంతో మిత్తీలు కూడా కట్టే పరిస్థితి లేకుండాపోయింది. ప్రస్తుత ప్రభుత్వం రైతన్నలపై చిన్నచూపు చూస్తున్నది.

## అధికారుల ఉరుకులు.. పరుగులు



**మహబూబ్‌నగర్–నవభూమి** : ఈ నెల 5వ తేదీ వరకే డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసిందని అధికారులు ప్రకటించారు. అయితే, ఆదివారం 'నమస్తే తె లంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'పరిశీలన.. పరేషాన్' కథనంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. నిర్దేశిత గడువు ముగిసినా ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 20 పోస్టుల భర్తీకి జాబితా రాకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. ఎంతో కష్టపడి చదివి చేతికాడికి వచ్చిన ప్రభు త్వ ఉద్యోగం రాదేమోనని అభ్యర్థులకు నిరాశ ఎదురైంది.ఈ నేపథ్యంలో అభ్యర్థుల అవస్థలు, ఆవేదన, ఆందోళనను 'నమస్తే తెలంగాణ' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మొదట కోర్టు కేసు ఉందనే సాకును బూచీగా చూపినా.. ఎట్టకేలకు ఎస్జీటీ స్పె షల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. 20 పోస్టులకుగానూ 39 మం ది అభ్యర్థులను ఆదివారం జిల్లా అధికారులు ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కావడంతో 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపా రు. అయితే, ఏజెన్సీ గిరిజనులకు న్యా యం చేయాలని ఏజెన్సీ ఏరియా గిరిజ న హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. 9న నియామక పత్రాలు..ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చే సి ఈ నెల 9వ తేదీన నియామక పత్రా లు అందజేయనున్నారు. దసరా సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు వి ధుల్లో చేరనున్నారు. దీనికి తోడు 2008 డీఎస్సీలో అర్హత సాధించి పలు కారణాలతో నష్టపోయిన వారికి ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియ కూడా చేపడుతున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనున్నది.

## పత్తి లోడు వాహనం బోల్తా పడి ఇద్దరు కూలీలు మృతి

**వడ్డేపల్లి–నవభూమి** : పత్తిని లోడు చేసుకొని తిరిగి వస్తున్న బొలెరో వాహనం సోమవారం కర్నూలు జిల్లా ఆర్.కొంతపాడు గ్రామ సమీపంలోని వరిపొలం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లెకు చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. తిమ్మాజిపల్లె గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పది మంది కూలీలు పత్తిలోడును వేసుకొని తిరుగు ప్రయాణంలో కర్నూలు జిల్లా ఆర్.కొంతపాడు గ్రామ సమీపం వరి పొలం వద్దకు చేరుకోగా బొలెరో వాహనం అదపు తప్పి బోల్తాపడటంతో తిమ్మాజిపల్లె గ్రామానికి చెందిన తరికి జ్ఞానవంతుడు(26), కురువ డోలు జమ్మన్న(43)లు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి కూలీలు గాయపడ్డారు. కాగా, మృతుడు తరికి జ్ఞానవంతుడుకి మూడేళ్ల క్రితమే వివాహమైంది. మరో మృతుడు కురువ డోలు జమ్మన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఒక్క రోజుకే పరిమితమైన పండుగ

**నారాయణపేట–నవభూమి** : తెలంగాణ సంస్కృ తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. వేడుకలను అధికారికంగా నిర్వహించకపోగా, స్వ చ్ఛందంగా నిర్వహిస్తుండగా కరెంట్ కోతలు విధించడం గమనార్హం. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు. పల్లె నుంచి ప్రపంచంలోని వివిధ దేశాల్లో సైతం కనుల పండువగా వేడుకలను నిర్వహించేలా ఖ్యాతిని తీసుకొచ్చారు.అంతేకాకుండా దసరా వేడుకలకు ముందు ప్రత్యేకంగా బతుకమ్మ చీరలను అందించి 8రోజుల పాటు వేడుకలు నిర్వహించి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందించారు. నారాయణపేటకు ఎంతో చరిత్ర కలిగిన బారం బావిని గతంలో నారాయణపేట కలెక్టర్‌గా పనిచేసిన దాసరి హరిచందన శుభ్రం చేయించి విద్యుద్దీపాలతో అలకరింపజేసి 8రోజులపాటు ఆటాపాటలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంతో ప్రత్యేకత కలిగిన పండుగ వేడుకలను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. వేడుకలు ప్రారంభమై మూడు రోజు లు కావస్తున్నా ఊసేలేదు. 7వ తేదీన ఒక రోజు మాత్రం అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చంద్రకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా, జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల పరిస్థితి ఇలాగే ఉందని చెప్పొచ్చు.



**గ్రామాల్లోనూ అదే పరిస్థితి..**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిధుల లేమి కారణంగా గ్రామాలు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కేసీఆర్ పాలనలో పట్టణాలతో సరిసమానంగా గ్రామాలు అభివృద్ధి సాధించాయి. గ్రామాల్లో ట్రాక్టర్లతో తడి, పొడి చెత్త సేకరణకు శ్రీకారం చుట్టా రు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించేవారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పరిఢవిల్లింది. ఏటా బతుకమ్మ కోసం ఆయా ప్రాంతాలను ప్రత్యేకంగా శుభ్రం చేసేవారు.దీంతో మంచి వాతావరణంలో బతుకమ్మ నిర్వహించేవారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. కనీసం పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు కూడా నిధులు లేని పరిస్థితి దాపురించింది. ఈ క్ర మంలో మహిళలే ముందుకొచ్చి స్వచ్ఛందంగా శు భ్రం చేసుకొని బతుకమ్మ ఆడుతున్న దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంత మహిళలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వ వివక్షను దుయ్యబడుతున్నారు.

**ముఖ్యమంత్రికి సోయి లేదు..**

పరిపాలించడానికి చేతగాని ముఖ్యమంత్రికి రాష్ట్ర పండుగలపై కూడా సోయి లేదు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుక మ్మ పండుగ ఎంతో ప్రత్యేకంగా నిలుస్తున్నది. అలాంటి పండుగను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు.

**మహిళలంటే చిన్నచూపెందుకు..?**

పదేండ్లు బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. కేసీఆర్ సారు ఆడపడుచులకు చీరలు కూడా ఇస్తుండె. రేవంత్‌రెడ్డి సీఎం అయినంక బతుకమ్మ పండగకు కళ తప్పింది. మహిళలంటే సరార్‌కు ఎందుకు ఇంత చిన్నచూపు. అధికారం కోసం గొప్పలు చెప్పి ఉన్న పండుగలకు కూడా ప్రాధాన్యత ఇస్తలేరు.

**ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది..**

బతుకమ్మ పండుగకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 18ఏండ్లు నిండిన మహిళలందరికీ చీరలను పంపిణీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వేడుకలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచి విదేశాల్లోనే బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుండగా, మన పండుగైన తెలంగాణ లోనే వేడుకలను నిర్వహించకుండా అవాంతరాలు సృష్టించడం బాధాకరం.

# ఎల్‌టీఎఫ్, బఫర్ జోన్లలో వెంచర్లు

**గద్వాల–నవభూమి** : గద్వాల జిల్లా కేంద్రంలో రియల్ భూమ్‌తో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతిలోకి వెళ్లాయి. ఆ భూముల విలువ దాదాపు రూ.50 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. అందులో కొన్ని ప్రభుత్వ భూములు ఉండగా, కొన్ని పది శాతం భూములు, చెరువులు, రిజర్వాయర్లలోని ఎఫ్‌టీఎల్ భూములు ఉన్నాయి. ఇవన్నీ కబ్జా అయ్యాయని అధికారులకు తెలిసినా ఫిర్యాదులు లేవనే సాకుతో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**జములమ్మ రిజర్వేయర్‌లో..**

గద్వాలకు కూతవేటు దూరంలో అంతర్రాష్ట్ర రహదారికి అనుకొని జములమ్మ రిజర్వాయర్ ఉంది. దాదాపు ఆరు నెలలపాటు జములమ్మ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మూడు రాష్ట్రాల భక్తులు హాజరు అవుతారు. పెద్ద ఎత్తున వ్యాపారాలు జరుగుతాయి. దాంతో ఇక్కడ ఒక్కో ప్లాటు రూ.రెండు కోట్లకు పైగానే పలుకుతోంది. రియల్టర్లు రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్‌లోకి చొచ్చుకొచ్చి, ప్లాట్లు చేసి విక్రయించారు. ఇంకో చోట ఎఫ్‌టీఎల్‌లో, మరొకరు బఫర్ జోన్‌లో మినీ ఫంక్షన్ హాల్స్ నిర్మించారు. వేల ఎకరాలకు సాగునీటితో పాటు గద్వాలలో సగం పట్టణానికి మంచినీటిని అందించే పథకం ఈ రిజర్వాయర్‌పైనే ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రిజర్వాయర్‌ను ఇరిగేషన్ అధికారులు కాపాడటంలో విఫలం అవుతున్నారు. ఇక్కడి భూములను కాపాడటానికి హైదరాబాద్ హైడ్రా తరహాలో ఒక వేదికను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సంగాలను చెరపట్టిన మాఫియా**

పట్టణానికి పడమర దిశగా రాయిచూర్ రోడ్డుకు ఆనుకొని సంగాల చెరువు ఉంది. ఇది నోటిఫైడ్ చెరువు. ఒకప్పుడు గద్వాల పట్టణానికి మంచి నీటిని అందించింది. ప్రస్తుతం సాగునీటిని అందిస్తోంది. పట్టాలు ఉన్నాయనే నెపంతో చెరువు లోపలికి చొచ్చుకొచ్చారు. వేల సంఖ్యలో ట్రిప్పుల మట్టిని తరలించి, భూమి ఎత్తుపెంచారు. బఫర్ జోన్‌దాటి, వెంచర్లు వేశారు. దీనిపై ఎన్నో కథనాలు, ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు. దానికి ఆనుకొని సంగాల పార్కును అభివృద్ధి చేశారు. అప్పుడే బఫర్ జోన్ చుట్టూ వాక్‌వే నిర్మిస్తామని చెప్పినప్పటికీ నిర్మించలేదు. ప్రస్తుతం ఆ భూమి అంతా కబ్జాదారుల చేతిలో ఉంది. అదేవిధంగా గద్వాలకు కూత వేటు



దూరంలో ఉత్తర దిశలో ఉన్న చెనుగోనిపల్లి చెరువును గ్రామస్థులు ఆక్రమించారు. ఏకంగా దాదాపు 40 ఇళ్లను నిర్మించారు. వీటికి పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వడంతో పన్నులు చెల్లిస్తున్నారు. ఇలాంటి కబ్జాలపై హైడ్రా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి, రక్షణ కల్పించాలని అంటున్నారు.

**పది శాతం స్థలాల్లో పాగా**

గద్వాలలో వెంచర్లు మునిసిపాలిటీకి కేటాయించిన పది శాతం స్థలాల్లో చాలా మంది భవంతులు నిర్మించారు. వీటికి మునిసిపల్ అధికారులు పర్మిషన్ లేకున్నా పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మించారు. మరికొన్ని చోట్ల కుల సంఘాల కమ్యూనిటీ హాల్స్ నిర్మించారు. నాలాలు, కందకాలను కబ్జాచేశారు. దాంతో వర్షం నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేక కొన్ని కాలనీల్లోకి వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు, భూములను కాపాడాలని గద్వాలలో ఇటీవలే ప్రజా ఆస్తుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. వీళ్లు పదిశాతం స్థలాలు, నాలాలు, ప్రభుత్వ భూముల కబ్జాలను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించకపోతే న్యాయ స్థానాల ద్వారా పరిరక్షించుకోవాలని వారు నిర్ణయం తీసుకున్నారు. కబ్జాదారులకు ప్రజా ప్రతినిధుల అండదండలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.